# ప్రత్యేక వివాహ చట్టము, 1954

ప్రత్యేక వివాహ చట్టం క్రింద వివాహానికి ఈ క్రింది నియమాలు వర్తిస్తాయి:

1. వధూవరులలో (ఇంతకు ముందు వివాహం జరిగి ఉంటే వారి) ఎవరికైనా జీవిత భాగస్వామి జీవించి ఉండరాదు.

2. ఇరువురిలో ఎవరున్నూ వెర్రి వారు లేక మతిస్థిమితం లేని వారై ఉండరాదు.

3. వరుడికి 21 సంవత్సరాల వయసు మరియు వధువుకు 18 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.

4. వధూవరులు నిషేధిత బంధుత్వము కలవారై ఉండరాదు.

**వివాహం రిజిస్ట్రేషన్ చేసే పద్ధతి :**

1. ఈ చట్టం ప్రకారం వివిధ సంబంధాలు, నమ్మకాలు కలిగిన వ్యక్తులు వారి వివాహం జరుపుకోవచ్చు.

2. ఈ చట్టం ప్రకారం, ఇతర పద్ధతులలో జరిగిన వివాహాలను కూడా రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చును.

3. వివాహము చేసికొనగోరు వారు, సంబంధిత వివాహ అధికారికి నిర్ణీత నమూనాలో లిఖితపూర్వకముగా నోటీస్ ఇవ్వాలి. వివాహానికి సంబంధించిన ఏ ఒక పార్టీ అయినా నోటీస్ తేదీకి 30 రోజుల ముందు సదరు వివాహ అధికారి పరిధిలో నివాసం ఉండి ఉండాలి. నోటీసుతో బాటు వధూవరుల పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పుట్టినతేదీ ధృవీకరణ పత్రములు, నివాస చిరునామాను ధృవీకరించు పత్రములు కూడా సమర్పించవలెను.

4. నోటీసు అందగానే, వివాహాధికారి దాని ప్రతిని వివాహ నోటీసుల పుస్తకంలో నమోదు చేసి, ఒక ప్రతిని తన కార్యాలయంలో గల నోటీసు బోర్డులో ఉంచి, శాశ్వత నివాస ప్రాంతమునకు సంబంధించిన వివాహ అధికారి కార్యాలయమునకు మరొక ప్రతిని పంపవలెను. ఆ వివాహ అధికారి కూడా తన కార్యాలయములోని నోటీసు బోర్డులో సదరు నోటీసును ప్రదర్శించవలెను.

5. 30 రోజుల కాలం పూర్తి కాకముందు, ఎవ్వరైనా అట్టి వివాహ విషయంలో పైన తెలిపిన షరతుల ఉల్లంఘన జరిగినదని అభ్యంతరము తెలియచేయవచ్చును. అట్టి అభ్యంతరములపై విచారణ జరిపిన తరువాతనే వివాహము జరిపే విషయంలో తగిన నిర్ణయము తీసికొనవలెను.

6. 30 రోజుల నోటీసు కాలం పూర్తి కాగానే, 3 వ షెడ్యూల్ నందు చూపబడిన నమూనా ప్రకారము,వధూవరులు తమ ప్రకటనలపై సంతకములు చేసి వివాహ అధికారికి సమర్పించవలెను.

7. అప్పుడు వివాహ అధికారి ముగ్గురు సాక్షుల సమక్షంలో వివాహాన్ని జరిపి రిజిస్ట్రేషన్ చేస్తారు. వధూవరులు వారికి తెలిసిన భాషలో వివాహ అధికారి మరియు ముగ్గురు సాక్షుల సమక్షములో "…..అను నేను, …..అను నిన్ను నా చట్టపరమైన భార్యగా స్వీకరించుచున్నాను" అని వరుడు, అదే విధముగా "…..అను నేను, …..అను నిన్ను నా చట్టపరమైన భర్తగా స్వీకరించుచున్నాను" అని వధువు చెప్పవలెను. వివాహమును ఏ పద్ధతిలో జరుపుకొనినను వధూవరులు పై విధముగా చెప్పని యెడల వివాహము పూర్తి అయినట్లు కాదు. ఆ తరువాత వివాహాధికారి వివరాలను వివాహ ధృవీకరణ పుస్తకంలో నమోదు చేస్తారు.దీనిపై వధూవరులు మరియు ముగ్గురు సాక్షులు సంతకములు చేయవలెను. ఆ తరువాత 4వ షెడ్యూలులోని నమూనాలో వివాహ ధృవీకరణ పత్రమును జారీ చేయుదురు.

8. ముందుగానే ఏదో ఒక పద్ధతిలో వివాహము చేసికొని భార్యాభర్తలుగా జీవించుచున్నవారు కూడా ఈ చట్టము క్రింద తమ వివాహమును రిజిస్టరు చేయించు కొనవచ్చును. అట్టి సందర్భములలో వధూవరులు ఇరువురూ 21 సంవత్సరముల వయస్సు, నిండిన వారై ఉండవలెను. ఇటువంటి కేసులలో పార్టీల నుండి దరఖాస్తు వచ్చిన తర్వాత వివాహ అధికారియే పబ్లిక్ నోటీసును జారీ చేసి, అభ్యంతరములు రాని యెడల 30 రోజుల తరువాత వివరములను వివాహముల రిజిస్టరులో నమోదు చేసి పార్టీల మరియు ముగ్గురు సాక్షుల సంతకములు తీసికొని, 5వ షెడ్యూలు లోని నమూనాలో ధృవీకరణ పత్రమును జారీ చేయవలెను.